పాతివ్రత్యం

[కథానిక]

= శ్రీ గోరావఝల వెంకటసుబ్బరామయ్య =

"ఇదుగో - నా ఆఖరుమాట...ఇన్నాళ్లూ ఎలాగో కాలం గడిపాం - నాకు బ్రతుకుతానని ఆశ లేదు. నాకోసం నీవు బెంగపెట్టుకొని పిల్లలను పాడు చెయ్యవాక...ఆస్తిని అర్ధాన్నం చెయ్యాక. కులగౌర వాన్ని - పెద్దలకీర్తిని-నా పేరుప్రతిష్ఠలను నిలుపు... అదుగో ఏడుస్తున్నావు?...ఇలా ఐతే నాకు మన శ్శాంతి వుండదు. నీవు సంతోషంతో నేను చెప్పింది చేస్తా నంటే సుఖంగా ప్రాణంపోతుంది. ... తెలి సిందా? - నీవు మహాయిల్లాలి వని పేరుపడ్డావు... ఆ పేరుకు కళంకం రానియ్యబోకు..."

"అయ్యో! ఇదేమిటండీ!" అంది గద్గదకంఠంతో కనకమ్మ. పైన వినలేకపోయింది. "మీ రివాళ యిటు వంటి మాటలు మాట్లాడుతున్నా రేమండీ! మీ కేం ఫరవాలేదు. తప్పక నయమవుతుంది. మీరు మనసులో చింతపెట్టుకోవాకండి...మీరు లేని నాబ్రతు కెందుకు? మీరు పోయాక అసలు నేను బ్రతుకగలనా? బ్రతుకు తానా? మీతోనే నాపేరు - నాప్రతిష్ఠ - నాపసుపు కుంకుమ - నాసౌభాగ్యం అన్నీను. మీరు పోయాక యేముంటుంది నాకు? అన్నీ మీతోనే. మీరుపోయిన మరుక్షణంలో యీబొందెలో ప్రాణం వుండదని గట్టిగా నమ్మండి. మీరు లేని ఆస్తి నా కెందుకు? బిడ్డ లెందుకు? బంధువులతో యేంపని? బగ్గీలు దేనికి?..." అని ఆవేశంతో - కంపితస్వరంతో - కన్నీటిధారతో - విహ్వలమానసంతో అన్నది కనకమ్మ - ఎడంచేత్తో ముక్కును చీదుకుంటూ.

"అదుగో! గోరంతను కొండంత చేస్తావని తెలుసు...చూడు! నీవు కాపరాని కొచ్చిందిమొదలు కొని నీగుణాలనుచూస్తూనేవున్నా. ఇరవై యేండ్ల సాంగత్యంలో మన మన స్తత్వాలు ఐక్యమయాయి. మానసిక ప్రవృత్తులుఏకముఖాననడుస్తున్నాయి. భిన్నహృదయ కుసుమాలను ప్రేమసూత్రం బంధించింది. నేనే నీసర్వ స్వ మని నీవు భావించిన సంగతి నాకు తెలుసు... నీఅదృష్టంవల్లనే యింత కలిసివచ్చింది. ఇద్దరు నలుసులు కలిగారు... ఇంతకాలం ఒక పొరపొచ్చెలేకుండా సుఖంగా గడిపాం... కాని నాకు కాలం తీరింది. పిల్లల ముద్దుముచ్చట్లు చూచుకునే అదృష్టం లేదు కదా అనే చింత తప్ప మరేమీ లేదు. యీఅదృష్టం నాకు లేకపోయినా, నీవైనా వుండి సక్రమంగా పిల్లలకు చదువుసంధ్యలు చెప్పించి వృద్ధికి తెస్తానంటే సంతోషం...ఇదే నేకోరేది. ఇంతకంటే వేరేమీ లేదు..." అని కన్నీరు పెట్టుకున్నాడు సాంబయ్య.

"నేనే పతివ్రతనైతే అలాంటి అశుభం జరుగనేజరుగదు..." కనకమ్మనోటిగుండా యీమాటలు అప్రయత్నంగా వెలువడినాయి.

ఆమెకు స్వప్నావస్థనుండి జాగ్రదావస్థకు వచ్చినట్లనిపించింది. తనుఅన్నదేమిటో స్మృతిపథంలో విహరించి జ్ఞాపకానికి తెచ్చుకొని వల్లిస్తున్నది. తాననన్నది తనకే ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని కలిగించింది. ఆమాటలు తను అందామనుకోలేదు. ప్రయత్నించలేదు కూడాను. ఐతే ఎలా వచ్చినాయి? ఎవ రనిపించారు? వీటికి సమాధానం లభించడం లేదు. ఐతే తను నిజంగా పతివ్రతేనా?...తన జీవితపుటలను తిరగవేసుకుంటూ సూక్ష్మంగా పరిశీలిస్తూపోతున్నది. ఎన్నడైనా పాతివ్రత్యభంగకరమైన, పతిఇచ్ఛావిరుద్ధములైన పనులుగాని, మాటలుగాని, తలపులుగాని చేశానేమో అని సూక్ష్మంగా ఆలోచిస్తున్నది. అది ఒక స్వర్గోపమ దృశ్యం.

సాంబయ్య నిర్విణ్ణుడై రెప్పవాల్చక కనకమ్మను చూస్తున్నాడు. ఆమెముఖంలో అతని కండ్లకు స్వర్గ

జ్యోతి కనిపించింది. ఇద్దరూ భావనాప్రపంచంలో విహరిస్తున్నారు.

సాంబయ్య మూడునెలలనుంచి జ్వరంతో తీసుకుంటున్నాడు. శరీరంలో ఎముకలు, తోలు తప్ప మరేమీ మిగులలేదు. డాక్టర్లు వచ్చి చూస్తున్నారు. మందులు యిస్తున్నారు. కాని సాంబయ్యకు బ్రతుకుమీద ఆశ పోయింది. దీర్ఘ జాడ్యం ప్రాణహానికి కారణమని అనుమానం పడ్డది. అదిగాక డాక్టర్లుకూడా ఫలానిజబ్బని గ్రహించలేకున్నారు. ఏమందులో తాపుతున్నారు; తోచిన యింజక్షనులు యిస్తున్నారు. ఆ అనుమానచికిత్సాసముద్రంలో యీదుతూ సాంబయ్య మూడునెల్లు గడిపాడు. శక్తి వుడిగింది. ఆశ అంతరించింది. ఎదుట అంతులేని అంధకారం మృత్యురూపమై గోచరిస్తున్నది. అంతులేని జీవితానికి పొలిమేర సమీపించిం దనుకుంటున్నాడు.

కాని కనకమ్మకు ఆశాజ్యోతి అంతరించలేదు. భగవంతుడు అప్రయత్నంగా తన నోటినుండి శుభవాచకాలు బైలువెడలించాడు. దీని ఫలితం శుభంకాని అశుభం కాదని నిశ్చయించుకున్నది. ఆశ ప్రత్యక్షంగా రూపందాల్చి ఆమెముందు నిలబడింది. "నీభర్త కేమీ ఫరవాలేదు. నీమంగళసూత్రం గట్టిది" అంటున్నట్లుగా తోచింది. కనకమ్మ ఆ ఆశను అలాగే నమ్మి కూచోలేదు. ఆ ఆశను భక్తిలోకి దింపింది. సదా భగవధ్యానమే — పరమేశ్వరనామమే ఆమెకు శరణ్యమైంది. ఆ ఆశాజ్యోతిని కల్పించిన భగవంతుని అర్చించడంలో, అలంకరించడంలో, అర్ఘ్యమివ్వడంలో, షోడశోపచారపూజల్లో సగంపొద్దు గడిచిపోతున్నది; మిగతాసగం కాలం పతిసపర్యలో. ఆమెకు తన శరీరభ్రాంతి బొత్తుగా పోయింది. ఒక్కొక్కరోజు తీరికలేక అన్నం తినటమే మానేసేది. మనసా, వాచా, కర్మణా ఆమెకు రెండే పనులు: పతిసేవ, భగవద్భక్తి.

రాత్రిపూట కనుమూసేది కాదు. పతితలగడ మాటున కూచొని భగవన్నామం జపిస్తూండేది. ఎప్పుడైనా తనకు అతీతమై కనుమూత పడితే-పతి ఆరోగ్యవంతుడైనట్లు, శంకరుడు ప్రత్యక్షమై "అమ్మా! నీతపస్సు ఫలించింది. నీపతి నీకు దక్కాడు. నీవు వేసింది వెయ్యిరూపులతో వర్ధిల్లుతుం"దని దీవించినట్లుగా కనబడేది-వినబడేది. యీవిధంగా యిప్పుడామె తన జీవితాన్ని గడుపుతున్నది.

యింటి వ్యవహారాల సంగతి అన్నగారికి వదిలేసింది. పిల్లల పోషణ ఒదినగారికి ఒప్పచెప్పింది. ఇక నిశ్చింతగా భగవధ్యానంలో మునిగిపోయింది.

ఆవూరినుంచి పాత అసిస్టెంటు సివిల్ సర్జనుకు బదిలీ ఐంది. ఆచోట్లో మరొకాయన వచ్చాడు. కనకమ్మఅన్నగారు ఆయనను పోయి తీసుకొచ్చాడు. ఆయన వచ్చి చూచాడు. మం దిచ్చివెళ్లాడు.

ఆరోజు సాంబయ్యకు కొంచెం పండ్లరసం పోయింది. కొంచెం నిద్రపట్టింది. మరునాడు డాక్టరుగారు వచ్చారు. మం దిచ్చివెళ్లాడు. ఇలా నాలుగు రోజులు గడిచాయి. సాంబయ్యకు నిద్ర, ఆకళ్లు ఎక్కువైనాయి. ఆయనలో జీవకళ ఉత్పత్తి ఐంది. వ్యాధి తిరుగుముఖం ఐంది. తుపానుకల్లోలానికి వూగిసలాడుతున్న జీవితనావ ఒడ్డుపట్టింది. "డాక్టరుగారి హస్తవాసి. సాంబయ్యగారు మృత్యుముఖంనుండి జారి కిందపడ్డా"డన్నారు లోకులు. "నాభార్య పాతివ్రత్యమహిమ" అనుకున్నాడు సాంబయ్య. కనకమ్మ భగవంతుని కరుణాకటాక్షవీక్షణఫలితమనుకున్నది.

౨

సాంబయ్య బలంపట్టి తేరుకున్నాడు. ఆయనకు తను బ్రతికింది కనకమ్మ పాతివ్రత్యంవల్లనే నని మనసులో స్థిరపడిపోయింది. కేవలం స్థిరపడటమే కాదు. యీసంగతిని– కనకమ్మశపథాన్ని, దాని ఫలితాన్ని — నలుగురికీ చెప్పి వినిపించాడు. దాంతో కనకమ్మపేరు కొంచెం బైటికొచ్చింది. "ఆమె పతివ్రత అన్న మాటకు తిరుగులేదు" అని లోకులు అనుకోసాగారు. అంతే కాదు. చుట్టుప్రక్కలవాండ్లు తమ పిల్లలకు బాగుండకపోతే దిష్టివిభూతి మంత్రించి తీసుకోపోయేవారు కనకమ్మతోటి. వాండ్ల అదృష్టంవల్లనో, యీమె మంత్రబలిమివల్లనో వాండ్లకు నెమ్మ

దించేది. దీనివల్ల జనులలో ఇంకా పేరుపడింది. "దయ్యాలను కూడా కనకమ్మగారు వదిలిస్తుందిట. ఆమె పేరు చెబితే దయ్యాలు పారిపోతాయట" అని ఒకాయన అన్నాడు. ఇంకేం, దాంతో దయ్యాల వారు బైలుదేరారు. చిన్న దయ్యాలు, పెద్ద దయ్యాలు, వూగుదయ్యాలు, నవ్వుదయ్యాలు, పలుకని దయ్యాలు, ఆవులింత దయ్యాలు, అనుమానదయ్యాలు, లేచి పరుగెత్తేవి, తెలియక పడిపోయేవి, తెలిసి గిచ్చి రక్కి కొరికేవి—ఇలాంటివి ఎన్నో దయ్యాలు కనకమ్మ ముందు ప్రత్యక్షమయాయి. ఆమె వీటన్నిటికీ ఒక్క విభూతి మంత్రించి యిచ్చేది. దాన్ని ధరించగానే కొన్ని దయ్యాలు చెప్పకుండా పారిపోయేవి. దీనితో ఆమె పేరుప్రఖ్యాతులు మరీ వెల్లడయాయి. యీ తడవ ఇంకోరకపు దండు బైలుదేరింది; పిల్లలు పుట్టని వాండ్లు, గర్భం నిలిచి జారిపోయేవాండ్లు, పిల్లలు పుట్టి బ్రతుకని వాండ్లు. వారిలో కొందరి కష్టాలు, కోరికలు తీరేవి. కొందరికి మామూలు స్థితిలోనే నడుస్తుండేవి. దీన్ని 'వాండ్ల ఖర్మం' అన్నారు.

ఐతే వీటన్నిటిలో కనకమ్మ పాత్ర ఎలా నటిస్తున్నదీ విచారించాలి. మొదట్లో పిల్లలకు దిష్టిమంత్రం పెట్టటానికి సందేహించింది-అనుమానించింది-జంకింది. ఎందుకు లేనిపోని శ్రమ, ఇదెక్కడి జంజాటకమని-లేక, మందుయందు నమ్మకం లేని వైద్యునిలాగ-పారని తేలుమంత్రగానిలాగ ప్రవర్తించేది. జనుల బలవంతాన్నైతేనేమి, భర్త ప్రోద్బలంవల్లనైతేనేమి మంత్రించి యిచ్చింది. మంత్రం పారింది. మందు గుణమిచ్చింది. ఆనోటా ఆనోటా అందరికీ తెలిసింది. జనుల సమ్మర్దం ఎక్కువైంది. ఒకదాని తరువాత మరొక వ్యాధికి యిదే మంత్రాన్ని-మందును వాడుతున్నది. బ్రహ్మాస్త్రంలాగా అకుంఠితంగా పారుతున్నది. క్రమేణా యిందులో ఆమెకు అనుభవము-ఆనందము కలుగుతూవచ్చింది. ఇదే తుదకు సేవాభావంగా-కర్తవ్యంగా మారింది. యీవిధంగా ఆమె తన తపఃఫలాన్ని ఇతరులకై వెచ్చించి అందులోనే ఆనందానుభూతిని అనుభవించసాగింది. ఇప్పుడామెది కేవలం,సాత్త్వికజీవితం. ఆమెకు ఆదర్శం అరుంధతీ, అనసూయలు.

కనకమ్మకు క్రమంగా బాహ్యాంతరిక నిర్మలత్వం వృద్ధిఅవుతున్నది. ఎన్ని పను లున్నను భర్తపనులకు అంతరాయం కలిగేది కాదు. భర్తమాటకు ఆలస్యమయేదికాదు. భగవద్భక్తితోపాటు పతిభక్తికికూడా మానసపీఠాన సమానస్థానం యిచ్చింది—ఒకే ఆకాశంలో సూర్యునకు, చంద్రునకు సమానస్థానం వున్నట్లుగా. ఆమెకు ఇహలోకదైవం భర్త; పరలోక దైవం భగవంతుడు. ఎవర్ని విడిచిపెట్టగలదు ?

సేవాపరాయణత్వంలో శరీరపోషణకే అవకాశం దొరకదు. ఇక భర్తఉపచారాల కెక్కడ అవకాశం దొరుకుతుంది ? కనుక విధిలేక కొన్ని పనులను మానవలసి వచ్చింది. భర్తకు నీళ్లు తోడి స్నానం చేయించడం, పీటవెయ్యటం, మడిగుడ్డ అందివ్వటం, సంధ్యకు నీళ్లు పెట్టటం, గంధం అక్షింతలు తీసియివ్వటం, భోజనానంతరం నడుం వాల్చటానికి మంచం వెయ్యటం మొదలయిన చిన్నచిన్న పనులకు అంతరాయం కలిగింది. సాంబయ్య వీటికి బహుకాలంనుంచి భార్యవల్ల అలవాటు పడ్డా సంతోషంతో వీటన్నిటినీ తనే చేసుకుంటూ భార్యను ఇంకోపనికి నియోగిస్తున్నాడు. అక్కడ ఇతరుల పని ఎక్కువైనకొద్దీ ఇక్కడ సాంబయ్యపనులలో ఒక్కొక్కటీ లోపిస్తున్నది. తుదకు ఒక్క అన్నం వడ్డించడం తప్ప తక్కిన పను లన్నీ స్వస్తిచెప్పాయి. సాంబయ్యకు దీనివల్ల కష్టంకలుగలేదు. కనకమ్మకు దీన్నిగురించి ఆలోచించుటకు తీరిక లేదు. ఈవిధంగా కాలం గడిచిపోతున్నది.

3

సాంబయ్య పిల్ల పెండ్లి బహువైభవంగా చేశాడు. తగిన సంబంధం. శిష్టాచార సంపన్నులు. యింత కుడువా, కట్టా వున్నవాండ్లు. పిల్లవాడుకూడా రూపసి. బుద్ధిమంతుడు. వేదం చదువుతున్నాడు. తగిన యీడూ జోడూ.

కొడుకు బి. ఏ. చదువుతున్నాడు. పరభాషాభ్యసనత్వంలో పరవేషావలంబనకూడా అవసరమన్న సిద్ధాంతానికి వ్యతిరేకుడు. నిరాడంబరుడు. తలిదండ్రుల పవిత్ర భావైక్యత ఇతనిలో చేకూరింది. భార్యాభర్త లిరువురూ తమ ఫలాలను కాపాడవలసిన

దని భగవంతుని ప్రార్థించేవారు. యీయేడు పిల్లవాడికి పెండ్లి చెయ్యాలని సాంబయ్య తలపెట్టాడు. కనకమ్మ తలవూపింది. యేమాటకూ 'సరే' తప్ప 'ఇలా' నని తన అభిప్రాయాన్నిచ్చి యెరుగదు. పతిముందర తన అస్తిత్వమే లేదని భావించింది. ఇక పిల్లవాని అభిప్రాయంతో పనే లేదు. ఎందుకంటే, తలిదండ్రుల మాటే అతనికి వేదవాక్యం. సంబంధం నిశ్చయమైంది. పండు, పసుపు పెట్టుకున్నారు. ముహూర్త నిశ్చయం చేసుకున్నారు. దీన్ని గురించి పిల్లవానికి జాబు వ్రాశాడు. ముహూర్తం దాదాపు నెలరోజు లుంది.

ఒకరోజు అకస్మాత్తుగా సాంబయ్యకు జ్వరం వచ్చింది. కనకమ్మమనసు చివుక్కు మన్నది. ఎంత మంది కష్టాలనో తొలగిస్తూ, కష్టసహిష్ణుతకు అభ్యస్తమై గడ్డకట్టిన మనస్సు కరగి ప్రవహింప సాగింది. భావి ఆశంకలు అనేకం ఆమెకు తోస్తున్నాయి. కండ్లముందు అనేక భయంకర అంధకార చిత్రాలు కన్పిస్తున్నాయి. సర్వనాడులు, శక్తులు, అవయవాలు క్రుంగిపోయినాయి. ఎందుకో తెలియదు.

జ్వరం వచ్చి వారంరోజు లైంది. దిగలేదు. సాంబయ్య మూసిన కన్ను తెరవలేదు. ఎన్నో విభూతులు పెట్టింది. ఎన్నో మంత్రాలు చదివింది. ఎన్నో దేవుళ్లను మ్రొక్కుకున్నది. తనకు చేతనైనంత చేస్తూనేవుంది. డాక్టరును పిలిపించి చూపించారు. ఆయన మందిస్తూ చూస్తూవున్నాడు. మరి నాలుగురోజులు గడిచాయి. జ్వరం తీవ్రరూపం దాల్చింది. కనకమ్మ అనుమానం అధికమైంది. దుఃఖం పొంగి పొర్లివస్తున్నది. కాని పతిసేవకు భంగం కలుగనియ్యలేదు. ఆహారనిద్రలు మానేసింది. ఆమెకు అరిష్టసూచకములు అంతకంతకు స్పష్టంగా తోస్తున్నాయి. మనసు తుపానుగాలిలోని నావవలె వూగిసలాడుతున్నది. మంగళసూత్రం చూచుకున్నది. వళ్లు ఝుల్లుమన్నది. శుభచిహ్నమైన మంగళసూత్రాన్ని రెండుచేతులతోనూ గట్టిగా పట్టుకొని పైటకొంగులో దాచుకున్నది. యిదే నాసౌభాగ్యానికి, సుఖానికి, సర్వానికి కారణమైం దనుకున్నది.

జ్వరం ప్రకోపించింది. నోటమాట బందైంది. గురక పుట్టింది. పిల్లవానికి తంతియిచ్చారు. ఇల్లంతా దుఃఖసూచకనిశ్శబ్దంతో నిండివుంది. అందరి ముఖాలూ కళావిహీనమై వున్నాయి. జ్వరం ౧౦౬ డిగ్రీలకు ఎక్కింది. డాక్టర్లు ఆదుర్దాపడుతున్నారు. తోచిన ఇంజక్షనులు యిస్తున్నారు. కాళ్లు భూమిమీద ఆనటం లేదు. సాయంత్రం ఏడుగంటలైంది. జ్వరం దిగుతున్నది. ౧౦౫ కు వచ్చింది. మరొక అర్ధగంటకు ౧౦౩ కు దిగింది. డాక్టర్లు ఆశలు వదులుకున్నారు. మరొక అర్ధగంటలో శీతలానికి వచ్చింది. కాళ్లు, చేతులు చల్లబడ్డాయి. సాంబయ్య ఒక్కసారి కన్ను తెరిచాడు; మూశాడు. సాంబయ్య జీవితనాటకం అంతటితో సమాప్తిచెందింది. అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు. అంతే.

కనకమ్మ దొడ్లోకి పోయింది. ఆమెహృదయ భావము అగోచరము. ఆమె స్థిరంగా కనబడుతున్నది. పతి కనుమూయగానే ఒక్కసారి గొల్లుమంది. తదుపరి ధైర్యంగా వుంది. ముఖాన అర్ధణావెడల్పు కుంకుమ బొట్టు వుంది.

బంధువులు, చుట్టాలు, ప్రక్కవాండ్లు అందరూ చుట్టూ మూగివున్నారు. కొందరు గోడకు చేరబడి విచారంగా వున్నారు. కొందరు ఆయనమంచిని, పనులను, మాటలను, దయాభావాన్ని వర్ణిస్తున్నారు. "పిల్లవాడి పెండ్లిముహూర్తం రేపే. పెండ్లికిబదులు యీపని జరిగింది" అనుకుంటున్నారు. యిలా ఎవరికి తోచినవిధంగా వారు సాంబయ్యగారినిగురించి మాట్లాడుకుంటున్నారు.

గంట గడిచింది. రెండుగంటలైంది. కనకమ్మ తిరిగిరాలేదు. కొంచెం అనుమానం తగిలింది. ఆదుర్దాగా ఇటూ అటూ వెతుకుతున్నారు. ఎక్కడా ఆమెజాడ లేదు. దొడ్లోకి పోయి చూచారు. లేదు. ఇల్లంతా వెతికారు. కనబడలేదు. అనుమానం అధికమైంది. బావిలో తొంగిచూచారు. కొందరు బావిలోకి దిగారు. అనుమానం ప్రత్యక్షమైంది. అందరూ గొల్లుమన్నారు. కనకమ్మశవం బావిలో దొరికింది. చల్లగా బైటికి తీశారు. పరీక్షించారు. ఆమె ఎప్పుడో నిర్జీవ ఐంది.

ఉదయం ఏడుగంటల బండికి పిల్లవాడొచ్చాడు. సంగతి విన్నాడు. నెత్తి బాదుకున్నాడు.

"మహాపతివ్రత. ఇద్దరినీ ఒకేచితిమీద సంస్కారంచెయ్యాల" లన్నారు.

రెండు ఆత్మలూ స్వర్గంలో కలుసుకుంటాయేమో! రెండుశరీరాలుమట్టుకు ఇక్కడ చితిమీద కలుసుకున్నాయి.